క్లుప్తంగా

బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



అచ్చంపేట: స్నేహ హస్తాలు సౌజన్యంతో పేద బీటెక్ విద్యార్థినికి తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు అచ్చంపేటలో శుక్రవారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల భవితకు బంగారు బాట వేస్తున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెలిపారు. విజయవాడ ఎస్సార్కే ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీటెక్ పూర్తి చేసిన మునగా ఝాన్సీలక్ష్మికి పైథాన్ ప్రాజెక్టు నిమిత్తం రూ 40వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను అందజేయడం అభినందనీయని తెలిపారు. స్నేహ హస్తాలు ప్రతినిధి తాయి కరీముల్లాబాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ రవి, స్నేహ హస్తాలు ప్రతినిధి మన్నెం భద్రయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ క్రోసూరు డీఈఈగా శ్రీనివాసరావు



క్రోసూరు: విద్యుత్ శాఖ క్రోసూరు డీఈఈగా ఎం.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గురజాల ఏడీఈగా చేస్తూ కొత్తగా ఏర్పడిన క్రోసూరు రూరల్ సబ్ డివిజన్ డీఈఈగా బాధ్యతలు తీసుకున్నారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల డీఈఈగా పని చేయనున్నట్లు ఆయన వివరించారు. రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని, విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయన్ను కలుసుకుని అభినందనలు తెలిపారు.

నేడు శ్రవణా నక్షత్ర ప్రత్యేక పూజలు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాల మధ్య కొండపై గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రవణా నక్షత్ర పూజలను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వామికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలను చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త గోపాల్ నాయక్ తెలిపారు. భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఇంట్లో అలిగి వచ్చిన విద్యార్థి తల్లికి అప్పగింత



రాజుపాలెం: తిరుపతికి చెందిన సాయి అనే విద్యార్థి ఇంట్లో అలిగి ట్రైన్‌లో హైదరాబాద్ వెళుతుండగా నరసరావుపేటలో దిగబోయే సమయంలో రైల్వే పోలీసులు గుర్తించారు. మండలంలోని కొండమోడు సమీపంలో గల వీరమ్మ కాలనీలోని అనాథ పిల్లల ఆశ్రమానికి బుధవారం తీసుకొచ్చారు. తర్వాత ఆచూకీ కనుక్కొని తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. విద్యార్థి తల్లి కొండమోడు ఆశ్రమానికి శుక్రవారం వచ్చింది. కానిస్టేబుల్ విజయ సమక్షంలో విద్యార్థిని తల్లికి అప్పగించారు. ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావుకు విద్యార్థి తల్లి అంజమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురుకి గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దాటిన తర్వాత 4వ మైలురాయి వద్ద శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంకొండ నుంచి గుంటూరు వేగంగా వెళుతున్న కారు 4వ మైలు రాయి వద్ద ఎదురుగా ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. దీంతో కారు అదుపుతప్పి పక్కకు దూసు కెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారులు ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రయాణికులు బాధితులను ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: వ్యక్తి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన పచ్చా హనుమంతరావు (52) ఈ నెల ఒకటో తేదీ నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యురాలు పచ్చా రమాదేవి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలొచ్చారు.. జాగ్రత్త !

- తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- నిఘా పెంచాల్సిన పోలీసులు
- ఆందోళనలో ప్రజలు



స్థానిక యోగాశ్రమం సమీపంలోని సీసీటీవీలో రికార్డైన డాబా మెట్లు దిగుతున్న దొంగ

అమరావతి: గతంలో వేసవిలో మాత్రమే, అది కూడా ఊరి చివరన నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న ఇళ్లలో మాత్రమే అడపాదడపా దొంగతనాలు జరిగేవి. ప్రస్తుతం నగరం నడిబొడ్డులోనూ జరుగుతున్నాయి. ఇంటి తాళం వేసి ఊరెళ్లితే చాలు, తిరిగొచ్చే వరకు భద్రంగా ఉంటుందో లేదో చెప్పలేం. మండల కేంద్రమైన అమరావతిలో గురువారం రాత్రి రెండుచోట్ల దొంగలు చోరీ చేయడానికి యత్నించారు. ఒకచోట విఫలం కాగా, మరోచోట వెండి ఆభరణాలు ఎత్తుకుపోయారని సమాచారం. యోగాశ్రమం సమీపంలో ఇంటి యజమానులు రాత్రి నిద్రిస్తుండగానే పక్క డాబా మీద నుంచి దూకి లోనికి ప్రవేశించినట్లు సీసీటీవీలో రికార్డ్ అయింది. మరో ఇంట్లో యజమానులు నాలుగు రోజుల కిందట గుంటూరులో చదువుకుంటున్న తమ కుమార్తె దగ్గరకు వెళ్లారు. దీన్ని కనిపెట్టిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు.

పోలీసుల నిఘా పెంచాలి

ఇంటిల్లిపాది దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే ముందు సమాచారమిస్తే దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు గానీ దొంగతనాలకు అడ్డుకట్ట పడటం లేదు. తాళాలు వేసిన ఇంట్లో బీరువాలలో విలువైన బంగారు, వెండి, నగదును లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. అమరావతిలో చోరీలు పెరిగిన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రాత్రి నిరంతర గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గస్తీలో ఎక్కువగా మెయిన్ రోడ్డుకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది.



ఊరు వెళ్లే వారు సమాచారమివ్వాలి

ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్‌స్టేషన్లో సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూస్తాం. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తాం. మీ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలి. వీలైతే ఫొటోలు తీసి సమాచారాన్ని 9440736217 నంబరుకు ఫోన్ చేసి అందించాలి. చెప్పాలన్నారు.

– అచ్చియ్య, సీఐ

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి శోభాయాత్ర



అంకమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడులో గల అంకమ్మ తల్లికి రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం, శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా పూజలు జరిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి కర్లం శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి చీర, సారెలతో శోభాయాత్రను నిర్వహించారు. తొలుత స్థానిక పోలేరమ్మ తల్లి ఆలయం నుంచి ప్రారంభమైంది. ఆలయంలో పూజలు జరిపి అక్కడ నుంచి అంకమ్మ తల్లి దేవాలయం వరకు మహిళలు సామూహికంగా అమ్మవారికి పసుపుకుంకుమ, చీర, గాజులు, పూలు పండ్లు, ఫలహారాలు, గోరింటాకు తదితర పూజా సామగ్రితో, మేళ తాళాల ప్రదర్శనతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజారి రాములు ప్రత్యేక అలంకరణ గావించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్, సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానాన్ని నిర్వహించారు. సాయంత్రం భజన మాస్టర్ కాకర్ల పరమేశ్వరరావు, తాళ్లూరి అశోక్ ఆధ్వర్యంలో అమ్మవారికి భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ దుప్పటి చిన్న బాబు, కోశాధికారి అత్తిపట్ల వీరాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు



మన గ్రోమోర్ సెంటర్‌లో నాలుగు ట్రాక్టర్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఇసుక

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి అనేది ప్రజలందరికీ జగమెరిగిన సత్యమే. అధికారంలోకి రాకముందు ఇసుక ఉచితంగా అందిస్తామంటూ ప్రగల్భాలు పలికిన నాయకులు ఇప్పుడు బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అమరావతి, అచ్చంపేట మండలాల్లోని రేవుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తెస్తున్నారు. సత్తెనపల్లిలోని మన గ్రోమోర్ సెంటర్‌లో వాటిని నిలిపి భవన నిర్మాణదారులకు ఒక్కో ట్రాక్టర్ రూ.2,500 నుంచి రూ. 3 వేల వరకు బహిరంగంగా అమ్ముతున్నారు. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు జరుగుతున్నా అధికార పార్టీ అండదండలు ఉండటంతో అధికారులు కూడా కన్నెత్తి అటువైపు చూడడం లేదు. ఇప్పటికైనా నదీ పరీవాహక ప్రాంతాల్లో, ఇసుక రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

మోసాలకు మూల్యం చెల్లించక తప్పదు



బాలాజీనగర్‌తండాలో మేనిఫెస్టోను ప్రజలకు అందిస్తున్న భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నాయకులు

సత్తెనపల్లి సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

నకరికల్లు: ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెప్పేరోజు త్వరలోనే వస్తుందని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాలాజీనగర్‌తండాలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. క్యూర్ కోడ్‌తో కూడిన చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, యువత, కార్మిక వర్గాలను నమ్మించి చంద్రబాబు మోసం చేశారని మండిపడ్డారు. ఆయన అబద్ధపు వాగ్దానాలు, హామీల మోసాలను గుర్తుచేస్తూ క్యూఆర్ మేనిఫెస్టోను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు.

మోసం చేసిన బాబుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, తగినమూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల బాషా, గుత్తికొండ నన్నేసా, కొత్తపల్లి ప్రసాద్, కోవూరి నరసయ్య, కోటిరెడ్డి, అంజిరెడ్డి, సోషల్ మీడియా కార్యదర్శి రాజశేఖర్, తండాలోని నాయకులతో పాటు పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరెస్ట్‌తో భయపెట్టి నగదు వసూలు

ముప్పాళ్ల: అరెస్ట్ పేరిట భయపెట్టి నగదు వసూలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన అనుమాలశెట్టి శ్రీనివాసరావు ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. 'మీ అబ్బాయి బాల వెంకట సతీష్ అమ్మాయి వేధింపుల కేసులో ఇరుక్కున్నాడని, మేము ప్రభుత్వ అధికారులమని, అరెస్ట్ కాకుండా ఉండాలంటే రూ.50వేలు ఫోన్‌పే చేయా'లంటూ భయభ్రాంతులకు గురిచేసి చేయించుకున్నారు. ఈ సంఘటనపై శ్రీనివాసరావు భార్య పద్మావతి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితులతో సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయించి, డబ్బులు పంపిన ఫోన్ నంబర్ 9801241475ను బ్లాక్ చేయించి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

పెదకూరపాడు : మండలంలోని 75 తాళ్లూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పెదకూరపాడు ఎస్‌ఐ గిరిబాబు శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 6,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పేకాట, బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గిరిబాబు హెచ్చరించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు



అష్టలక్ష్మి కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నకరికల్లు: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నకరికల్లులో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం నిర్వహించనున్న ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కొమ్మూరి విశ్వరూపాచార్యులు సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అష్టలక్ష్మి కుంకుమ పూజలు, మండపార్చనలు, క్షీరాధివాసం, 108 రకాల విశేష ద్రవ్యాలతో దేవతామూర్తులకు స్నపన, మంత్ర పుష్పం తదితర పూజాధికాలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని విశేష పూజల్లో పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి భక్త బృందం, గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న మహా అన్నదానానికి ఏర్పాట్లు చేశారు.

దోమల నివారణతోనే విషజ్వరాలు దూరం



పశర్లపాడులో నీటి తొట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మరావు

రెంటచింతల: మన నివాస పరిసర ప్రాంతాల నుంచి దోమల నివారణతోనే మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలను దూరం చేయవచ్చునని మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో పర్యటించి వర్షాకాలంలో విషజ్వరాలు, అంటు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో అవకాశం ఉంటే మినరల్ వాటర్ తాగాలని.. ట్యాప్ వాటర్ అయితే వేడిచేసి చల్లార్చి తాగడం ఆరోగ్యానికి చాలా మంచిదని చెప్పారు. నివాస పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. మురుగునీరు ఉన్నా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా దోమ తెరలను, కిటికీలకు మెష్‌లను వాడాలని సూచించారు. పాత టైర్లు, కొబ్బరి బొండాలు ఇంట్లో ఉండకుండ ఊరికి దూరంగా పడవేయాలని కోరారు. ప్రతి శుక్రవారాన్ని కచ్చితంగా డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

వరముల నొసగవే వరలక్ష్మీ !

- భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించిన మహిళలు
- ముత్తైదువులకు వాయనాలు



పట్టణంలో ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



మహరాష్ట్ర వీధిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రాజుపాలెంలో వరలక్ష్మీదేవి అలంకరణలో అంకమ్మతల్లి

సత్తెనపల్లి: నియోజకవర్గంలో శుక్రవారం వరలక్ష్మి వ్రత పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్తైదువులకు వాయనాలు సమర్పించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఉదయం నుంచి ఇంటి వద్ద వ్రతమాచరించిన మహిళలు సాయంత్రం వేళల్లో ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని మాచర్లరోడ్డులో గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి మహిళలు పెద్దసంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో సువాసినులతో వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకులు నరసింహచార్యులు అమ్మవారిని వైభవంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, హనుమాన్ చాలీసా పారాయణం, వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. మహిళలు విశేష కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమరావతిలో..

వరలక్ష్మీ వ్రతాన్ని మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముత్తాయపాలెం నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అమరావతి అమరేశ్వరాలయంలో బాలచాముండేశ్వరీ, జ్వాలాముఖీ అమ్మవార్లకు శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చుకుని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

అచ్చంపేటలో..

స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆర్యవైశ్య ప్రముఖులు సూరే సుబ్బారావు, మణికంఠ ఆధ్వర్యంలో మహిళా విభాగం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు గుంటూరు బలరామాచార్యులు, సురేష్ ఆచార్యులు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు గ్రామాలనుంచి ఆర్యవైశ్య మహిళలు తరలి వచ్చి వ్రతాలలో పాల్గొన్నారు.

క్రోసూరులో..

వరలక్ష్మీ వ్రతాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవికి భక్తులు విశిష్టపూజలు నిర్వహించారు. మండలంలోని అనంతవరంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

ముప్పాళ్లలో..

మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే మహిళలె ఆలయాలకు చేరి అమ్మవార్లకు కుంకుమపూజలు, వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ముత్తయిదువులకు వాయనం, తాంబులం అందించి ఆశీర్వచనాలు పొందారు. మండలంలోని మాదలలోని శ్రీసాగరేశ్వరస్వామి, ముప్పాళ్లలోని శ్రీ కాశీఅన్నపూర్ణసమేత రామలింగేశ్వర స్వామి, చాగంటివారిపాలెంలోని శ్రీజగన్నాథస్వామి ఆలయంలోను అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బెల్లంకొండలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని కేతవరం శ్రీ వజ్ర లక్ష్మీ నారసింహుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కొండపై ఉన్న రాజ్యలక్ష్మీ అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రసన్నకుమారాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలను సమర్పించారు.

రాజుపాలెంలో..

మండలంలోని బ్రాహ్మణపల్లిలో గల శ్రీకాశీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం(శివాలయం)లో అన్నపూర్ణాదేవిని వరలక్ష్మీదేవిగా అలంకరించారు. పూజారి కోనూరు శ్రీనివాసశర్మ అమ్మవారికి కుంకుమార్చన, లలితా పారాయణం నిర్వహించారు. మరకతలింగానికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని అంకమ్మతల్లి గుడిలో అమ్మవారిని వరలక్ష్మీదేవిగా పూజారి ఫణికుమార్‌శర్మ అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పూజారి తీర్థప్రసాదాలు అందించారు.



ముత్తాయపాలెంలోని శ్రీలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వ్రతం చేస్తున్న భక్తులు



అనంతవరంలో వరలక్ష్మీ వ్రతం



ప్రత్యేక అలంకరణలో కేతవరం రాజ్యలక్ష్మీ అమ్మవారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పీబీ కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

క్రోసూరులో..

మండలంలోని క్రోసూరు, దొడ్లేరు, ఊటుకూరు, పీసపాడు గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బసవరాజు శుక్రవారం తెలిపారు. లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లంకొండలో..

లైన్లకు మరమ్మతులు దృష్ట్యా మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సరఫరా నిలిపివేనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పెదకూరపాడులో..

మండలంలోని పెదకూరపాడు, 75 తాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో 20 గ్రామ పంచాయతీలకు రెండో శనివారం మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రాజుపాలెంలో..

విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ కోటా పెదమస్తాన్ శుక్రవారం తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. ఆమె దుస్తులను బట్టి 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని ఎస్‌ఐ వేణుగోపాల్ తెలిపారు. మృతదేహం ఎక్కడిదని ఆరా తీస్తున్నారు. వివరాల కోసం 9440796168ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.